

వివిధ దేశాల జాతీయ పతకాలతో విన్యాసం





త్రివర్ణంతో ప్యారాచూట్ గ్లైడర్ల విన్యాసం



ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్

వినువీధిలో విహారం..!

- అబ్బురపరచిన విహంగ విన్యాసాలు
- అతిపెద్ద వైమానిక ప్రదర్శన ప్రారంభం
- దేశ రక్షణ సామర్థ్యాలు ప్రదర్శించే వేదిక
- మేక్ ఇన్ ఇండియా కల్పనతో ఆవిష్కరణలు
- ఏరో ఇండియా-2025లో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

బెంగళూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వినువీధిలో విహంగాల ప్రదర్శన అబ్బురపరిచింది. రంగురంగుల అద్భుతాలు ఆకాశంలో ఆవిష్కరించాయి. రెండేళ్లకోసారి జరిగే ఏరో ఇండియా ప్రదర్శనలు కేవలం విన్యాసాలు కావని దేశరక్షణా సామర్థ్యాలను ప్రదర్శించే వేదిక అని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభిప్రాయపడ్డారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద వైమానిక ప్రదర్శనలు ఏరో ఇండియా 2025 సోమవారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. బెంగళూరు యలహంక ఎయిర్‌బేస్‌లో ఓ పండుగ వాతావరణం తలపించింది. నింగిలో యుద్ధ విమానాలు, తేలికపాటి తేజస్, హెలీకాప్టర్లతోపాటు సూర్యకిరణ్‌ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కేంద్రరక్షణమంత్రి ఏరో ఇండియా 2025 ప్రదర్శనలను ప్రారంభించి వివిధ దేశాలనుంచి వచ్చిన రక్షణశాఖ ప్రతినిధులు, రక్షణమంత్రులు, దేశీయ రక్షణ, వైమానిక సంస్థల ముఖ్యులను ఉద్దేశించి రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడారు. భారతరక్షణా వ్యవస్థ కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రపంచస్థాయిలో ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్స్ విభాగంలో రాణిస్తున్నామన్నారు. దేశరక్షణకు అంతర్గత భద్రతకు రక్షణారంగంలో ఆవిష్కరణలతోనే శాంతి సాధ్యమన్నారు. ఆత్మనిర్భర్ లక్ష్యంగా రక్షణారంగంలో ఆవిష్కరణలకు అన్ని విధాలా ప్రోత్సాహం ఇస్తున్నామన్నారు.

19 దేశాల భాగస్వామ్యం

ఏరో ఇండియా ప్రదర్శనలో అమెరికా, ఫ్రాన్స్, రష్యా, దక్షిణకొరియా, జపాన్, ఇంగ్లండ్, బ్రెజిల్‌తోపాటు పలు దేశాలు పాల్గొన్నాయి. ఓఈఎంలు, 35 భారతీయ ప్రముఖ కంపెనీలు ఎల్ అండ్ టీ, భారత్ ఫోర్జ్ లిమిటెడ్, అదాని డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, మహేంద్ర డిఫెన్స్ సిస్టమ్స్ లిమిటెడ్, బ్రహ్మోస్ ఏరోస్పేస్, అశోక్‌లేల్యాండ్ డిఫెన్స్‌తోపాటు ప్రభుత్వరంగ సంస్థలు హెచ్‌ఏఎల్, బీఈఎల్, బీహెచ్‌ఎల్ వంటి ప్రముఖ దిగ్గజకంపెనీలు పాల్గొన్నాయి. ఎయిర్‌బస్ (ఫ్రాన్స్) అల్టామెరిటైమ్ (యూఎస్‌ఏ), జీఅండ్‌టి దక్షిణకొరియా, జాన్ కాఖెరల్ డిఫెన్స్ యూకే, మిట్సుబిషి (జపాన్), రాఫెల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్ (ఇజ్రాయెల్), సఫ్రాన్ (ఫ్రాన్స్)తో పాటు ప్రముఖ విదేశీ ఓఎంఈలు తమ భవిష్యత్తు ప్రాజెక్టులను ప్రదర్శించాయి.



సదస్సుకు విచ్చేస్తున్న విదేశీ ప్రతినిధి



వీక్షిస్తున్న సందర్శకులు

ఏరో స్పేస్ పరిశ్రమను ప్రోత్సహించాలి : డీసీఎం డీకే

బెంగళూరు ఏరోస్పేస్ పరిశ్రమలో అత్యుత్తమమైన ప్రతిభ కలిగి ఉందని విమానాలు, హెలికాప్టర్‌లు ఉత్పాదనా సౌలభ్యాలు స్థాపించేందుకు తగిన స్థలమని డీసీఎం డీకే శివకుమార్ అభిప్రాయపడ్డారు. ఏరో ఇండియా ప్రారంభ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున పాల్గొని ప్రసంగించారు. ప్రతిభావంతులు విదేశాలకు వలస వెళ్లకుండా నియంత్రించి భారత్‌లోనే సద్వినియోగం చేసుకోవాలని అభిప్రాయపడ్డారు. భారత సాంకేతిక పారిశ్రామిక ప్రగతిలో కర్ణాటక కీలకమైన రాష్ట్రం అన్నారు. ప్రపంచస్థాయి పరిశోధనా సంస్థలు అత్యాధునిక ఏరోస్పేస్ కంపెనీలు కల్గిన నైపుణ్యత ఇక్కడ ఉందన్నారు. ఇటీవల కొన్నేళ్లుగా కర్ణాటక దేశంలోని ఉత్పత్తి, పారిశ్రామిక ప్రగతితోపాటు ప్రముఖ జీడీపీలో గణనీయమైన ప్రగతి సాధించిందన్నారు. పరిశోధనలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశ్రామిక ప్రోత్సాహకం వంటి వాటిని భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకమైన పారిశ్రామిక పాలసీ ప్రకటించేందుకు మా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆకాశానికి అడ్డులేదని ప్రదర్శనల ద్వారా తెలుసుకోవచ్చునన్నారు. ఎయిర్‌షో పౌర, వైమానిక రక్షణ రెండింటిలోనూ భారత ప్రగతిని విశ్వానికి చూపే అతిపెద్ద కార్యక్రమమన్నారు. ఏరో ఇండియా కేవలం ప్రదర్శనలు కాదని భారతసామర్థ్యం చాటే వేదిక అన్నారు. 2013లో ఏరోస్పేస్ పాలసీని ప్రకటించిన తొలి రాష్ట్రం కర్ణాటక అన్నారు. దేవనహళ్ళి వద్ద ఏరోస్పేస్ కంపెనీలకు వెయ్యి ఎకరాలను కేటాయించి ఏరోస్పేస్‌పార్క్‌ను ప్రారంభించామన్నారు. దేశానికి ఏరోస్పేస్‌పార్క్‌గా బెంగళూరు అభివృద్ధి చెందుతోందన్నారు. దేశంలో ఏరోస్పేస్, రక్షణ పరిశోధనలో 60శాతం సాధన రాష్ట్రంనుంచే జరుగుతోందన్నారు. హెచ్‌ఏఎల్, ఇస్రో, బోయింగ్ ఇండియా వంటి సంస్థలు భారతరక్షణ, అంతరిక్ష సామర్థ్యం కోసం ఎన్నో సాధనలు చేశాయన్నారు. 1.50లక్షలమందికిపైగా ఉద్యోగాలు సాధ్యమయ్యాయన్నారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో బెంగళూరు మూడోస్థానం సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఎయిర్‌షో అందరికీ విజయం, స్ఫూర్తిదాయకం కావాలని ఆకాంక్షించారు. 1996లో ప్రారంభమైన ఎయిర్‌షో అంచెలంచెలుగా అభివృద్ధి చెందిందన్నారు.

250 ఒప్పందాలు

ఉత్తరప్రదేశ్, తమిళనాడులలో స్థాపించిన రక్షణ పారిశ్రామిక కారిడార్‌లలో 250కుపైగా ఒప్పందాలు జరిగాయన్నారు. 6-8 గ్రీన్‌ఫీల్డ్ పరీక్షలు, ప్రామాణిక సౌలభ్యాలను స్థాపించేందుకు, వైమానిక రక్షణ రంగంలో ఆర్థిక తోడ్పాటు ఇచ్చేందుకు పరిచయం చేశామన్నారు. రక్షణా ఎగుమతులను 2013-14తో పోలిస్తే ప్రస్తుతం 31శాతం ప్రగతి సాధ్యమైందన్నారు. 500కుపైగా స్టార్టప్‌లు ఎంఎస్‌ఎంఇలు రక్షణ రంగం ఆధునికీకరణకోసం ఐడెక్స్ పరిధిలో పనిచేస్తాయన్నారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్‌లు కల్గి ఉన్నందున ఏడాది నుంచి ఏడాదికి 10-12శాతం ప్రగతి సాధ్యం అవుతోందన్నారు. రక్షణారంగంలో సహకారాన్ని క్రియశీలకం అయ్యేందుకు ఏరో ఇండియా వేదిక అయ్యిందన్నారు.



సూర్యకిరణ్ విమానాల విన్యాసం

కౌటిల్యుడిని స్మరించుకున్న రాజ్‌నాథ్..

ప్రస్తుతం అంతరిక్ష పరిశోధనా ఆధారిత వ్యవస్థలతో నిఘా పెంచామన్నారు. మానవ సహిత, రహిత రాడార్ వ్యవస్థతోపాటు ఇటీవల డ్రోన్ ప్రయత్నాల అత్యవసరం కూడా రుజువు చేశాయన్నారు. రక్షణారంగంలో పరిశోధనలు, ఆవిష్కరణలు, వర్ధమాన సవాళ్లను పరిష్కరించేదిశగా వెళ్లాల్సి ఉందన్నారు. భారతీయ సాంకేతికతకు పురాతన చరిత్ర ఉందంటూ కౌటిల్యుడిని స్మరించారు. దేశప్రజలు, సరిహద్దులను ప్రతికూల వాతావరణంలో రక్షించే నైతిక బాధ్యత ఉందని, సాంకేతికంగా అభివృద్ధి చెందేందుకు ఆయుధాలను అత్యాధునికంగా రూపొందించుకోవడం కీలకమన్నారు. రక్షణా ఉత్పత్తుల పరిశ్రమలకు ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్రప్రభుత్వం పారిశ్రామిక స్నేహశీలిపాలసీలను తీసుకొచ్చిందన్నారు. భారతీ రక్షణ, పర్యావరణ వ్యవస్థలో స్వావలంబన సాధించామన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశంగా పేరొందిన భారత్ 2047నాటికి పరివర్తన కల్గిన దేశం కానుందన్నారు. కొత్తగా రక్షణారంగం కోసం పనిచేసే కంపెనీలకు 75శాతం ఎఫ్‌డీఐను అనుమతించామన్నారు. అవసరమైతే వందశాతం అనుమతులు ఇస్తామన్నారు. ఇప్పటివరకు రక్షణారంగంలో 46 జాయింట్ ఇండస్ట్రీస్, కంపెనీలో విదేశీ పెట్టుబడులకు అనుమతులు ఇచ్చామన్నారు.





వేదికపై కేంద్రమంత్రి, డీసీఎం తదితరులు

యత్నాళ్‌కు అధిష్టానం షాక్

- క్రమశిక్షణ కమిటీ నోటీసులు
- 72 గంటల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం



బెంగళూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): బీజేపీలో మరో గుబులు పట్టుకుంది. ఇప్పటివరకు గ్రూపు విభేదాలతో తారస్థాయికి చేరిన వర్గపోరుకు చెక్ పెట్టాలని అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. రెబెల్ నేత బసనగౌడ పాటిల్ యత్నాళ్‌కు అధిష్టానం నోటీసులు జారీ చేసింది. క్రమశిక్షణా కమిటీ ద్వారా జారీ చేసిన నోటీసులలో 72 గంటలలోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. బీజేపీ కేంద్ర క్రమశిక్షణా కమిటీ కార్యదర్శి ఓంపాఠక్ సోమవారం నోటీసులు జారీ చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, మాజీ సీఎం యడియూరప్పలతోపాటు వారి ఆప్తులకు వ్యతిరేకంగా మారిన యత్నాళ్‌కు ఇచ్చిన నోటీసులకు ఎలాంటి వివరణ ఇస్తారనేది వేచి చూడాలి. యత్నాళ్‌తోపాటు రెబెల్ కూటమి సభ్యులంతా ఢిల్లీలో ఉన్నారు. రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రి సోమణ్ణను భేటీ అయ్యారు. ఈలోగానే నోటీసు రావడంతో ఢిల్లీలోనే ఉండే యత్నాళ్ మంగళవారం సాయంత్రం లేదా బుధవారం అధిష్టానం ముందు హాజరయ్యే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది.



పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



పుణ్యస్నానాలు ఆచరిస్తున్న మఠాధిపతులు

కుంభమేళాకు శ్రీకారం

7

మాగడి రోడ్డులో రామరాజ్ శాఖ ప్రారంభం

బెంగళూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మాగడి మెయిన్‌రోడ్డు కాచోహళ్లిక్రాస్ స్టేట్‌బ్యాంకు సమీపాన రామరాజ్ సంప్రదాయ కాటన్‌వస్త్రాల శాఖను సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. భరత్‌నగర్ ఆయుర్ ఆశ్రమం విద్యావాచస్పతి డాక్టర్ విశ్వసంతోషభారతి లాంఛనంగా ప్రారంభించారు. కామెడి ఖిలాడి వాణిగౌడ జ్యోతి ప్రజ్వలన చేయగా కన్నడ నటుడు మిమిక్రీ గోపి తొలి కొనుగోలు చేశారు. రామరాజ్ కాటన్ వ్యవస్థాపక చైర్మన్ కేఆర్ నాగరాజన్ మాట్లాడుతూ రామరాజ్ సంప్రదాయదుస్తులకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ధోతి, షర్టులు, బనియన్‌లతోపాటు పండుగ, శుభ కార్యాలయాలలో మరింత సంప్రదాయంగా కనిపించేలాంటి కాటన్‌వస్త్రాలు మా ప్రత్యేకత అన్నారు. దక్షిణభారత్‌లో శ్రీకారం చుట్టిన రామరాజ్ ఉత్తరభారత్‌తోపాటు విదేశాలలోనూ రాణిస్తోందన్నారు. ఫ్యాన్సీబోర్డర్ ధోతీస్‌తోపాటు మరికొన్ని ఉత్పత్తులు మార్కెట్‌లోకి తీసుకొచ్చామన్నారు. ఏటా 25శాతం వ్యాపారాభివృద్ధి సాధ్యమవుతోందని ఇది నమ్మకం, విశ్వాసంతోనే వీలవుతోందన్నారు.



రామరాజ్ శాఖను ప్రారంభిస్తున్న విద్యావాచస్పతి డాక్టర్ విశ్వసంతోష భారతి

నేటి నుంచి ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు

- 'జిమ్'లో పాల్గొననున్న 40కిపైగా దిగ్గజ కంపెనీలు
- పాల్గొననున్న రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీఎం డీకే శివకుమార్, భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ తదితరులు

బెంగళూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు (జిమ్) ప్రారంభానికి సర్వం సిద్ధమైంది. రాష్ట్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ ప్యాలెస్ మైదానంలోనే ఉంటూ పర్యవేక్షిస్తున్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్ (జిమ్) 2025లో స్పాట్‌లైట్ కటింగ్, ఎడ్జ్ టెక్నాలజీస్‌కు ఆవిష్కరణల ప్రదర్శనలు భవిష్యత్తుగా మారనున్నాయని మంత్రి అభిప్రాయపడ్డారు. ప్రపంచంలోనే 40కుపైగా దిగ్గజకంపెనీల సీఈఓలు, చైర్మన్‌లు పాల్గొనే సదస్సుగా అభివర్ణించారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సదస్సును ప్రారంభిస్తారన్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ కీలక ప్రసంగం చేయనుండగా గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు ముఖ్యులుగా పాల్గొంటారన్నారు. ఫ్యూచర్ ఆఫ్ ఇన్నోవేషన్ ఎక్స్‌పోలో డ్రోన్ టెక్నాలజీ, స్పేస్ టెక్, అగ్రిటెక్, హెల్త్‌టెక్, సెమికండక్టర్ టెక్నాలజీ, ఎలక్ట్రిక్ మొబిలిటీ, సుస్థైనబుల్ మాన్యుఫాక్చరింగ్ సహా అన్ని రంగాల అత్యాధునిక పరిష్కారాలు ప్రదర్శించే వేదిక కానుందన్నారు. ప్రధాన ఎగ్జిబిటర్లలో జీఈ హెల్త్‌కేర్, హీరో ఫ్యూచర్ ఎనర్జీస్, రివర్ మొబిలిటీ, సరళ ఏవియేషన్, గెలాక్స్ ఐ స్పేస్, లామ్ రీసెర్చ్‌లు ఉన్నాయి. కాగా సోమవారం ఏర్పాట్లను డీసీఎం డీకే పరిశీలించారు.

తుంగభద్ర నుంచి అదనపు జలాల విడుదల

బళ్లారి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నుంచి హెచ్చెల్సీ ఆయకట్టులో సాగులో ఉన్న పంటలకు, ప్రజల తాగునీరు అవసరం నిమిత్తం 70 క్యూసెక్కుల నీరును బోర్డు అధికారులు సోమవారం విడుదల చేశారు. సిరువార, సంగనకల్లు, చాగనూరు, హద్దినగుండు, టి. బూదిహళ్ళ, కప్పగల్లు, ప్రాంతాల్లో వివిధ రకాల పంటలు కోత దశలో ఉన్నాయి. ఈ గ్రామాలకు తాగునీరు సైతం చాలా అవసరం. ముందు బోర్డు నీటి కేటాయింపు ప్రకారం కోటా ముగిసింది. డ్యాం నుంచి కాలువకు నీరు బంద్ చేశారు. అదనంగా మరోమారు నీరు విడుదల చేశారు. నీరు విడుదల చేయించడంతో మాజీ మంత్రి నాగేంద్ర తీవ్రంగా కృషి చేసినట్లు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాగేంద్ర ముఖ్యమంత్రి, డీసీఎం, అలాగే నీరావరి అధికారులతో కలిసి నీరు విడుదుల చేయకుంటే రైతులు నష్టపోతారని వివరించారు. ఆయన డిమాండ్‌కు సానుకూలంగా స్పందించిన అధికారులు నీరు విడుదల చేశారు. నీటి రాకతో రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. రైతులు గోవర్ధన్‌రెడ్డి, అన్న నాగరాజు, మాట్లాడుతూ తుంగభద్ర ఎగవ కాలువ కింద పంటలు కొన్ని సాగులో ఉన్నాయని, ఇలాంటి దశలో నీరు వదలడం హర్షణీయమన్నారు.



సాగు పనుల్లో నిమగ్నమైన రైతులు

ఆకాశ కుసుమం



935 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు సోమవరం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 935 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2కు 465 క్యూసెక్కులు వెళుతుతున్నాయన్నారు. అదేవిధంగా 36వ ప్యాకేజీ కింద శీర్పి, బెళుగుప్ప చెరువులకు 100 క్యూసెక్కులు వెళుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

చీనీ టన్ను రూ. 23వేలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 23వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ .5వేలు, సరాసరి రూ. 16,400తో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 43 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

రుచి..శుచి



ఖైదీలకు నాణ్యమైన ఆహారం.. మెనూలో మార్పులు

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు జైలు జీవితాన్ని తలచుకోవడానికే భయపడిపోయేవారు. నాలుగుగోడల మధ్య ఒంటరిగా నలిగిపోవడం ఒకటైతే... ఆహారం విషయంలో మరింత కఠిన నిబంధనలు ఉంటాయని చెప్పుకునేవారు. బ్రిటీష్ కాలం నుంచి జైళ్ల శాఖలో కఠిన నిబంధనలు పాటించేవారు. ఏదైనా తప్పు చేస్తే... 'జైల్లో చిప్పకూడు తింటావ్.. జాగ్రత్త..' అనే ఊతపదం ఇప్పటికి నాణుడిలో ఉంది. జైళ్ల శాఖలో వచ్చిన నూతన సంస్కరణలతో రిమాండ్ ఖైదీలు, జీవిత ఖైదీలకు పెట్టే భోజనంలో పెనుమార్పులు వచ్చాయి. చాలా మందికి జైలులో ఉండే ఖైదీలు ఏమి తింటారన్న విషయంపై ఆసక్తి ఉంటుంది. ఈ క్రమంలోనే ఆంధ్రజ్యోతి అనంతపురం రెడ్డిపల్లి జిల్లాజైలులో కటకటాల వెనుక ఎలాంటి వంటలు చేస్తారో తెలుసుకునే ప్రయత్నం చేసింది.


వంట చేస్తున్న ఖైదీలు


జైలులో ఖైదీలకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

కొలతల ప్రకారం మెనూ

గతంలో ఖైదీలు తినే ఆహారం అధ్వాన్నంగా ఉండేది. ఉడికీ ఉడకని అన్నం... ఉప్పు, కారం లేని నీళ్ల చారు, నీళ్ల పప్పు పెట్టే వారు. తినే ప్లేట్లు కూడా దారుణంగా ఉండేవి. కాఫీ, పాలు, ఇచ్చేవారు కాదు. ఉదయం 9-30 గంటలకు, సాయంత్రం 5 గంటలకు మాత్రమే భోజనం పెట్టేవారు. సంస్కరణల్లో భాగంగా ఆయా ప్రాంతాల్లో ఆహార శైలిని బట్టి మోనూలో మార్పులు తెచ్చారు. ఆహార నిపుణుల సూచనల మేరకు వడ్డిస్తున్నారు. ప్రతి వస్తువును సంబంధిత ఆరోగ్య ప్రమాణాలకు తగిన నిష్పత్తిలో తూకం వేస్తారు. ఉదారణకు... చపాతీల కోసం ప్రతి ఖైదీకి 400 గ్రాములు ఇస్తారు. ఆ మేరకు పరిమాణాన్ని బట్టి మూడు లేదా నాలుగు చపాతీలు ఇస్తారు. కంది, శనగ, పెసర పప్పులు 80 గ్రాములు, మటన్, చికెన్ 175 గ్రాములు, కూరగాయలు 200 గ్రాములు, పాలు 140 మి.లీ., బియ్యం 600 గ్రాములు.. ఇలా మెనూ కొలతలు నిర్ణయించారు.

వ్యాధిగ్రస్థులకు ప్రత్యేక ఆహారం

ఖైదీలు ఏదైనా అనారోగ్యం బారిన పడితే ప్రత్యేక మోనూ అమలు చేస్తారు. షుగర్ ఉన్న వారికి చపాతీ, నూనె లేని రోటీలు ఇస్తారు. కడుపు ఉబ్బరం, గ్యాస్ సమస్య ఉన్నవారికి పెరుగుతో కూడిన భోజనం ప్రత్యేకంగా వడ్డిస్తారు. వీఐపీ ఖైదీలకు కోర్టు అనుమతి మేరకు బయటి నుంచి ఆహారం అందిస్తారు.


జైలులో మినరల్ వాటర్ ప్లాంట్

సంస్కరణలతోనే నాణ్యమైన భోజనం

గతంలో ఖైదీల ఆహారం విషయంలో కొంచెం కఠిన నిబంధనలు ఉండేవి. 2010లో తీసుకు వచ్చిన జైలు సంస్కరణలతో చాలా మార్పులు వచ్చాయి. అందులో భాగంగా ఖైదీలకు ప్రభుత్వం రుపొందించిన ఆహార నియమాలను అమలు చేస్తున్నాం. ఖైదీలకు నాణ్యమైన భోజనం అందిస్తూ వారి ఆరోగ్యాన్ని సంరక్షిస్తున్నాం.



-షఫీవుర్ రెహమాన్,
సూపరింటెండెంట్, జిల్లా జైలు

రుచికరంగా వంటలు

జైలులో ఉన్న ఖైదీలే వంట వండుతారు. తోటి ఖైదీలకు ఆహారం వండే విషయంలో పరిశుభ్రతతో పాటు నాణ్యత పాటిస్తున్నారు. గతంలో జైలులో అల్పాహారం, పాలు ఇచ్చేవారు కాదు. ప్రస్తుతం జైలులో ఉదయం 7 గంటలకు పాలు, కాఫీ, టీ, 7:30 గంటలకు అల్పాహారం పెడుతున్నారు. అల్పాహారంగా.. చపాతీ, ఉప్మా, పులిహోరా, పొంగల్ పెడుతున్నారు. మధ్యాహ్నం భోజనం 11 నుంచి 12 గంటల మధ్య వడ్డిస్తారు. ఇందులో అన్నం, కాయగూరల సాంబారు, కందిపప్పు, శనగ పప్పు, పెసర పప్పు, రసం, వేపుడు, పెరుగు ఉంటాయి. అనంతరం మధ్యాహ్నం 1 గంటకు టీ లేదా పాలు ఇస్తారు. సాయంత్రం 5-30 నుంచి 6 గంటల మధ్య మధ్యాహ్నం చేసిన కూరలు కాకుండా మోనూలో మార్పులు చేసి వండుతారు. ప్రతినెలా మొదటి ఆదివారం మటన్ కర్రీ, మిగిలిన ఆదివారాల్లో చికెన్ వడ్డిస్తారు. ప్రతి మంగళవారం కోడి గుడ్డు ఉంటుంది. దీంతో పాటు జాతీయ, రాష్ట్రానికి సంబంధించిన పండగలకు స్వీట్లు పెడతారు. తాగేందుకు మినరల్ వాటర్ సౌకర్యం కల్పించారు.

అధనపు బాధ్యతలు..?

- నిబంధనలకు విరుద్ధంగా వార్డెన్లకు ఇన్‌చార్జ్ బాధ్యతలు
- ఒక్కో వార్డెన్‌కు మూడేసి వసతిగృహాల అప్పగింత
- సంక్షేమ వసతిగృహాల పర్యవేక్షణ గాలికి..
- ఆరోపణలొచ్చినా చర్యలకు మీనమేషాలు
- ముడుపుల వ్యవహారమే కారణమా..?

శ్రీసత్యసాయి జిల్లాలో గాడితప్పిన బీసీ వసతి గృహాల పాలన





ఓ ఉన్నతాధికారి అడ్డగోలు వ్యవహారం

అనంతపురం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్విభజనలో భాగంగా ఉమ్మడి అనంత జిల్లా రెండుగా విడిపోయింది. పాలనను వికేంద్రీకరించారు. అయితే కొన్నిశాఖల పాలన నేటికీ అనంత జిల్లా నుంచే సాగుతోంది. ఆ కోవకు చెందినదే బీసీ సంక్షేమశాఖ. ఈశాఖ శ్రీసత్యసాయి జిల్లా బాధ్యతలను డిప్యూటీ డైరెక్టర్ కింది స్థాయి అధికారికి అప్పగించారు. ఆ అధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో బీసీ వసతిగృహాల పాలన పూర్తిగా గాడి తప్పింది. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ ఆ అధికారి అంతా తానై వ్యవహరిస్తున్నారు. దీంతో వసతి గృహాల విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆ అధికారి నిబంధనలకు విరుద్ధంగా వార్డెన్లకు మరో వసతిగృహాలకు ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలను అప్పగించడం వెనుక భారీగా ముడుపులు చేతులు మారాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ అధికారిని ఆ బాధ్యతల నుంచి తప్పించాలని, ముడుపులపై విచారణ చేయాలని అనేక విద్యార్థి సంఘాలు, కులసంఘాలు ఆందోళనలు చేపట్టారు. అలాగే ఆ జిల్లా కలెక్టర్‌కే స్పందనలో ఫిర్యాదు చేశారు. అయినా ఇప్పటి వరకూ చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారులు వెనుకంజ వేయడం వెనుక అనేక అనుమానాలు కలుగుతున్నాయి.

నిబంధనలు గాలికి..


శ్రీ సత్యసాయి జిల్లాలోని నాలుగు డివిజన్ల పరిధిలో మొత్తం 57 బీసీ వసతిగృహాలు ఉన్నాయి. అందులో కదిరి డివిజన్ పరిధిలో 15, ధర్మవరం డివిజన్ 13, హిందూపురం డివిజన్‌లో 13, పెనుకొండ డివిజన్ పరిధిలోని 16 వసతి గృహాలు ఉన్నాయి. అయితే వీటి పర్యవేక్షణకు 23 మంది వార్డెన్లు మాత్రమే ఉన్నారు. వారిలో 8 మంది క్లాస్-4 ప్రమోట్ వార్డెన్లు కాగా... మిగిలిన 15 మంది రెగ్యులర్ వార్డెన్లు ఉన్నారు. సగటున ఒక్కో వసతిగృహంలో 100 నుంచి 200 పైగా విద్యార్థులు వసతి పొందుతున్నారు. వీరికి వసతిగృహంలో కావాల్సిన సౌకర్యాలు కల్పించడంతో పాటు... ఉదయం, సాయంత్రం వేళల్లో చదివించే బాధ్యత వార్డెన్లదే. భద్రత కూడా వారిదే. ఆ వసతిగృహాల పర్యవేక్షణ సవ్యంగా సాగుతోందో లేదా అనేది నిత్యం సమీక్షించాల్సిన బాధ్యత ఆ శాఖ ఉన్నతాధికారికి ఉంటుంది. అయితే బీసీ వసతిగృహాలకు సరిపడా వార్డెన్లు లేకపోవడంతో సమీపంలో ఉన్న వసతిగృహాల పర్యవేక్షణ కోసం ఉన్న వార్డెన్లకే అదనపు బాధ్యతలను కేటాయించే అధికారం ఆ శాఖ ఉన్నతాధికారికి ఉంటుంది. ఇదే ఆ అధికారికి కలిసి వస్తోంది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక వసతి గృహాన్ని పర్యవేక్షించే రెగ్యులర్ వార్డెన్‌కు దానికి 20 కి.మీ పరిధిలో ఉన్న మరో వసతిగృహానికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించాలి. అయితే ఆ అధికారి ఆ నిబంధనలను తుంగలో తొక్కుతూ తనకు అనుకూలమైన వార్డెన్లకు 40 నుంచి 50 కి.మీ దూరంలో ఉన్న మరో వసతిగృహానికి ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీని వెనుక భారీగా ముడుపులు చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాను రెగ్యులర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వసతిగృహం పర్యవేక్షణపైనే సంబంధిత వార్డెన్లు సమయపాలన పాటించరనే విమర్శలున్నాయి. అట్లాంటిది 50 కి.మీలలోపు ఉన్న మరో వసతిగృహాన్ని పర్యవేక్షించడం సాధ్యమా అనే ప్రశ్న ఇక్కడ ఉత్పన్నమవుతోంది. ఈనేపథ్యంలో వసతిగృహాల్లో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అడ్డగోలుగా ఇన్‌చార్జ్ బాధ్యతలు

బీసీ వసతిగృహాలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడం వెనుక భారీగా ముడుపులు పుచ్చుకున్నారనే ఆరోపణలు ఆ అధికారిపై తొలి నుంచీ వినిపిస్తూనే ఉన్నాయి. కదిరి డివిజన్‌లోని ఓ మండలంలో బీసీ హాస్టల్ వార్డెన్ విద్యార్థుల భోజనం కోసం సరఫరా చేసిన సరుకులు, బియ్యం అమ్ముకోవడం ఆధారాలతో బయటపడినా అయనపై ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. ఆ వార్డెన్‌పై విచారణ జరిగి, వాస్తవాలు వెలుగుచూసినా చర్యలు తీసుకోకపోవడం వెనుక రూ. వేలాది రూపాయల ముడుపులు ముట్టాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే ఆవార్డెన్‌కు చార్జ్ మెమోతో సరిపెట్టి విచారణ నివేదికను అటకెక్కించారనే విమర్శలున్నాయి. ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడం వెనుక ఒక్కో వసతిగృహం నుంచి రూ. 40 వేల నుంచి రూ. 50 వేల వరకూ ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. డైట్ బిల్లులు మంజూరైనా సందర్భంలోనూ... ఏ వసతిగృహానికి ఎంత మొత్తం బిల్లు మంజూరయ్యిందో... ఆ మొత్తంలో 6 నుంచి 8 శాతం వరకూ ముక్కుపిండి వసూలు చేస్తున్నట్లు ఆ వర్గాలే బహిరంగంగా చెప్పుకుంటున్నాయి. జిల్లాలోని ఓ డివిజన్‌లో పనిచేసే ఓ వార్డెన్‌కు ఏబీసీడబ్ల్యూఓ ఉద్యోగోన్నతి కల్పించేందుకు రూ. లక్షల్లో ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ శాఖ నిబంధనల మేరకు సీనియార్టీ జాబితాలో ముందు వరుసలో ఉన్న వార్డెన్లను కాదని ముడుపులు చెల్లించినవారికి ప్రమోషన్ కట్టబెట్టారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముడుపుల వసూళ్ల కోసం తన కార్యాలయంలో పనిచేసే ఓ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని మధ్యవర్తిగా నియమించుకున్నట్లు విమర్శలు ఉన్నాయి.

మచ్చుకు కొన్ని..

- ధర్మవరం డివిజన్‌లోని బుక్కపట్నం వార్డెన్‌కు హిందూపురం డివిజన్‌లోని రెడ్డిపల్లి వసతి గృహం ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. బుక్కపట్నం నుంచి రెడ్డిపల్లి వసతిగృహానికి వెళ్లాలంటే... దాదాపు 70 కి.మీ ప్రయాణం చేయాల్సి ఉంటుంది. అదే వార్డెన్‌కు ముదిగుబ్బ మండలం వై.వి పల్లి బీసీ హాస్టల్ ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. బుక్కపట్నం-వై.వి పల్లికి 40 కి.మీ దూరం ఉంది. ఒక్క వార్డెన్‌కు మూడు వసతి గృహాలను అప్పగించారంటే... ఆ వార్డెన్ ఆ మూడు వసతిగృహాలను పర్యవేక్షించడం సాధ్యమా అన్నది ఆ అధికారే చెప్పాలి.
- కదిరి డివిజన్‌లో తిమ్మమ్మ మర్రిమానులోని బీసీ వసతిగృహం వార్డెన్‌కు కదిరిలోని ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ రెండు వసతిగృహాలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. తిమ్మమ్మ మర్రిమాను నుంచి కదిరికి వెళ్లాలంటే దాదాపు 30 కి.మీ దూరం ఉంది. ఆ వార్డెన్‌కు మూడు వసతిగృహాల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు.
- ధర్మవరం డివిజన్ పుట్టపర్తిలోని బీసీ వసతిగృహం వార్డెన్‌కు కదిరి డివిజన్‌లోని నల్లమాడ కాలేజీ బాయ్స్ హాస్టల్ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఇలా పెనుకొండ, హిందూపురం డివిజన్లలోనూ ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి.



తన శాఖలో జరుగుతున్న అక్రమాలను నిరోధించాల్సిన బాధ్యత బీసీ సంక్షేమశాఖకు సారథ్యం వహిస్తున్న జిల్లాకు చెందిన మంత్రి సవిత పైనే ఉంది. అలాగే ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టులను భర్తీ చేయించాల్సిన బాధ్యత కూడా ఆమెపైనే ఉందనడంలో సందేహం లేదు. అక్రమ వసూళ్లతో వసతి గృహాలను భ్రష్టు పట్టిస్తున్న ఆ అధికారిపై ఏ మేరకు చర్యలకు ఉపక్రమిస్తారో వేచి చూడాల్సిందే.

ఐదు అంతస్థులపై నుంచి ఫ్లెక్సీని జారవిడిచేందుకు ఎక్కిన విద్యార్థులు



పట్టు తప్పితే..!

ఓటీపీఆర్ఐ విద్యార్థుల భయంలేని పనులు

డైరెక్టర్, ప్రిన్సిపాల్ సమక్షంలోనే 'సాహసాలు'

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మనిషి నగటు ఎత్తుపై నుంచి పడితేనే.. కాళ్లు, చేతులు విరుగుతాయి. అదే ఐదు అంతస్థులపై నుంచి పడితే ఇంకేముంది ఉహించుకుంటేనే ఒళ్లు జలధరిస్తుంది. అలాంటి పరిస్థితే సోమవారం జేఎన్టీయూ తైల సాంకేతిక, ఔషధ పరిశోధన సంస్థ(ఓటీపీఆర్ఐ) కళాశాలలో జరిగింది. సాక్షాత్తు కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ సమక్షంలోనే ఇలాంటి భయంలేని పనులు చేయడం గమనార్హం. కళాశాలలో ఈ విద్యాసంవత్సరం ఫార్మా-డీ కోర్సులో విద్యార్థులు కొత్తగా ప్రవేశాలు పొందారు. ఈ బ్యాచ్‌తోపాటు ద్వితీయ, తృతీయ, నాలుగో సంవత్సరం బ్యాచ్‌లకు వేరువేరుగా వినూత్నంగా పేర్లు పెట్టడానికి సంకల్పించారు. పేరును సర్‌ప్రైజ్‌గా ప్రదర్శించాలని (రివీల్) ఫ్లెక్సీ తయారు చేయించారు. విద్యార్థులు ఉత్సాహంతో వినూత్నంగా చేయాలని తలపించారు. ఇందులో భాగంగా కళాశాల ఐదో అంతస్థు భవనంపై నుంచి ఫ్లెక్సీని ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో ఏదైనా పొరపాటు జరిగితే జేఎన్టీయూకి చెడ్డ పేరు వస్తుందన్న అంశాన్ని అధికారులు విస్మరించారు. సాక్షాత్తు డైరెక్టర్, ప్రిన్సిపాల్ సమక్షంలోనే విద్యార్థులు భవనంపైకి ఎక్కి ఫ్లెక్సీని జారవిడిచారు. గాలికి ఫ్లెక్సీ ఎగిరిపోవడంతో దానిని విద్యార్థులు పట్టుకోవడానికి యత్నించారు. దాదాపు 50 అడుగుల ఎత్తులో భవనంపై నిలబడటానికి మినహా పట్టుకోవడానికి ఎలాంటి సాయం లేదు. అయినా విద్యార్థులు ఉత్సుకతతో ప్రమాదపు అంచులకు రావడంతో కిందనున్న విద్యార్థులు ఒక్కసారిగా గట్టిగా కేకలు వేశారు. ఇలాంటి భయంలేని పనులతో భవిష్యత్‌ను కోల్పోవాల్సిందేనని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడితోనైనా డైరెక్టర్, ప్రిన్సిపాల్ తేరుకుని వారించకపోవడంతో మళ్లీ నాలుగో అంతస్థులోకి వచ్చి ఫ్లెక్సీని జారవిడిచేందుకు ప్రయత్నించారు.

కరాటే, తైక్వాండోపై శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ యాజ మాన్య స్కూళ్లలో చదివే బాలికలకు ఆత్మరక్షణ కళలపై శిక్షణ ఇవ్వడానికి ప్రముఖ సంస్థలు, సొసైటీలు, ట్రస్టుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాణి లక్ష్మీబాయి ఆత్మ రక్షణ పరిశీలన-ఆత్మ రక్షణ ప్రశిక్షణ (సెల్ఫ్ డిఫెన్స్) కార్య క్రమం కింద శిక్షణ ఇస్తామన్నారు. ఎంపీయూపీ స్కూళ్లలో 6,7,8 తరగతులు చదివే 4,238 మంది విద్యార్థినులకు, జడ్పీ హైస్కూళ్లు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, మున్సిపల్, సామాజిక సంక్షేమ, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకూ చదివే 42,555 మంది విద్యార్థినులకు కరాటే, తైక్వాండో వంటి కళలపై శిక్షణ ఇస్తామన్నారు. ఈ కళలపై శిక్షణ ఇవ్వడంలో మూడేళ్ల అనుభవం ఉన్న రిజిస్టరైన జిల్లాలోని ప్రముఖ సంస్థలు, ట్రస్టులు, సొసైటీలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత ఉండి, ఆసక్తి ఉన్న సంస్థలు దరఖాస్తులను సమగ్ర శిక్ష కార్యాలయంలో పొంది, వాటిని పూర్తి చేసి ఈనెల 11వ తేదీ నుంచి 13వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా కార్యాలయంలో అంద జేయాలని ఆమె సూచించారు.

విజేత హిందూపురం

ముగిసిన ఖేలో ఇండియా అస్మిత్ అండర్-13 ఫుట్‌బాల్ టోర్నీ



విజేతగా నిలిచిన హిందూపురం జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా అస్మిత్ అండర్-13 బాలికల ఫుట్‌బాల్ టోర్నీ విజేతగా హిందూపురం జట్టు నిలిచింది. జనవరి 27 నుంచి ఆంధ్రాఫుట్‌బాల్ అసోసియేషన్, ఆర్డీటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఖేలో ఇండియా అస్మిత్ అండర్-13 బాలికల ఫుట్‌బాల్ లీగ్ టోర్నీ సోమవారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో ముగిసింది. హిందూపురం, కళ్యాణదుర్గం జట్ల మధ్య జరిగిన ఫైనల్ పోరులో 2గోల్స్ తేడాతో హిందూపురం జట్టు గెలిచింది. ఇండియా ఉమెన్ ఫుట్‌బాల్ జట్టు హెడ్‌కోచ్ క్రిస్పిన్ ఛెత్రీ, అసిస్టెంట్ కోచ్ ప్రియ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా క్రికెట్ కోచ్ అనితామిశ్రాల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీల రన్నరప్ అనంత


అనంత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో జిల్లా మహిళల జట్టు రన్నరప్‌గా నిలిచింది. మూడు రోజులుగా నెల్లూరులో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సీనియర్ ఉమెన్ హాకీ చాంపియన్‌షిప్-2025 సోమవారం ముగిసింది. ఫైనల్లో కడపతో తలపడిన జిల్లా జట్టు పోరాడి ఓడిపోయింది. తద్వారా రన్నరప్‌గా నిలిచింది. హాకీ అనంతపురం జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనీల్‌కుమార్ జట్టుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి అక్రమ్‌బాషా, కోచ్ దేవకి, మేనేజర్ సంతోష్‌కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కుమార్ ఎంటర్‌ప్రైజెస్ రిజిస్ట్రేషన్ రద్దు

జరిమానాకు రంగం సిద్ధం


ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): పాలకు సంబంధించి మాల్టోడెక్సిన్ విక్రయిస్తున్న కుమార్ ఎంటర్ ప్రైజెస్ రిజిస్ట్రేషన్లను పన్నుల శాఖ అధికారులు రద్దు చేశారు. గతంలో ఇతడు కమలానగర్‌లో శ్రీ కుమారి, కుమార్ ఎంటర్ ప్రైజెస్ పేర్లతో వ్యాపార లావాదేవీలు నిర్వహించాడు. ఆ సమయంలో వెంకటేశ్వర స్వామి ఆలయం ఎదురుగా ఉన్న వీధిలోని డోర్ నంబర్ 14/279లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తానని పన్నుల శాఖలో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. డీసీఎంఎస్ కార్యాలయం సమీపంలో డోర్ నంబర్ 14/457లో లావాదేవీలు సాగించాడు. ఈ క్రమంలో గతంలోనే 2023, 2024 ఆ రెండు రిజిస్ట్రేషన్లు రద్దయ్యాయి. తాజాగా సోమవారం సీటీఓ-2 నరసింహులు తనిఖీ చేశారు. తాజాగా హేమావతి ఎంటర్‌ప్రైజెస్ పేరుతో వ్యాపారలావాదేవీలు నిర్వహిస్తుండటంతో ఆ రిజిస్ట్రేషన్‌ను సైతం రద్దు చేశారు. జరిమానా సైతం విధించనున్నట్లు ఆయన తెలిపారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

థామస్ అల్వా ఎడిసన్ (జయంతి)



మానవాళిని ప్రభావితం చేసిన విద్యుత్ బల్బు, ఫోనోగ్రాఫ్ వంటి ఉపకరణాలను ఆవిష్కరించిన అమెరికాకు చెందిన గొప్ప ఆవిష్కర్త థామస్ అల్వా ఎడిసన్ 1847 ఫిబ్రవరి 11న అమెరికా దేశం ఒహియో గ్రామంలో జన్మించారు. వ్యాపారవేత్తయే కాకుండా ఎలక్ట్రిక్ పవర్ జనరేషన్, మాస్ కమ్యూనికేషన్, సౌండ్ రికార్డింగ్, మోషన్ పిక్చర్స్ వంటి వాటిపై ఎన్నో ఆవిష్కరణలు చేసి 1,093 పేటెంట్‌లు కలిగిన బహుముఖ ప్రజ్ఞాశాలి. తొలి ఇండస్ట్రియల్ ల్యాబ్‌ను రూపొందించిన ఘనత ఆయనదే. 1889లో పారిస్‌లో ప్రదర్శించిన సైన్స్ ప్రదర్శనలో 90 శాతానికి పైగా ఆయన రూపొందించినవే. 1931 అక్టోబరు 18న కన్నుమూశారు.

రావి కొండలరావు (జయంతి)




ప్రముఖ సినీ నటుడు రావి కొండలరావు 1932 ఫిబ్రవరి 11న కాకినాడ జిల్లా సామర్లకోటలో జన్మించారు. ఆయన నటుడిగానే కాక దర్శకుడు, రచయిత, పాత్రికేయుడు, నిర్మాతగా రాణించారు. సుమారు 600 చిత్రాలలో నటించారు. ఆయన భార్య రాధాకుమారి కూడా సినీ నటి. ఆయన సినిమా రచనలే కాకుండా ఆంధ్రజ్యోతి సహా పలు దిన, వార, మాస పత్రికలకు రచనలు అందించారు. 'పెళ్ళి పుస్తకం' సినిమాకు ఉత్తమ కథారచయితగా నంది అవార్డు పొందారు. అంతేగా హాస్య రచయితగా గుర్తింపు పొందారు. సుకుమార్ అనే కలం పేరుతో కొన్ని రచనలు చేశారు. 2004లో తామ్ర నంది పురస్కారం, కళాప్రపూర్ణ గౌరవం, ఇతర పురస్కారాలు పొందారు. 2020 జూలై 28న కన్నుమూశారు.

బుద్ధదేబ్ దాస్ గుప్త (జయంతి)



బెంగాలీకి చెందిన సినీ దర్శకుడు, కవి బుద్ధదేబ్ దాస్ గుప్త 1944 ఫిబ్రవరి 11న పశ్చిమ బెంగాల్ రాష్ట్రం పురూలియా ప్రాంతం అనారలో జన్మించారు. ఐదు సినిమాలకు 'నేషనల్ ఫిల్మ్ అవార్డ్ ఫర్ బెస్ట్ ఫీచర్ ఫిల్మ్' పురస్కారాలు లభించాయి. 2000లో ఉత్తమ దర్శకుడి పురస్కారం, 2007లో ఏథెన్స్ ఇంటర్నేషనల్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో గోల్డెన్ ఏథెనా పురస్కారం, 2008 మాడ్రిడ్‌లో లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్, ఇతర పురస్కారాలు పొందారు. 2021 జూన్ 10న కన్నుమూశారు.

పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ (వర్ధంతి)



రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)కు అధ్యక్షుడిగా వ్యవహరించి గుర్తింపు పొందిన దీన్‌దయాళ్ ఉపాధ్యాయ 1916 సెప్టెంబరు 25న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మధురలో జన్మించారు. భారతీయ జనసంఘ్‌లో క్రియాశీలకంగా కొనసాగారు. హిందూత్వ సిద్ధాంతాలతో కూడిన 'రాష్ట్రధర్మ' అనే మాసపత్రికను నిర్వహించారు. ఏకాత్మతా మానవతావాదం అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. 1968 ఫిబ్రవరి 11న కన్నుమూశారు. కాగా 2020లో వారణాసిలో 63 అడుగుల ఉపాధ్యాయ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

బీనాదేవి (పుట్టినరోజు)



తెలుగు రచయిత్రి బీనాదేవి 1935 ఫిబ్రవరి 11న విశాఖ పట్నంలో జన్మించారు. అసలు పేరు భాగవతుల త్రిపుర సుందరమ్మ. భర్త భాగవతుల నరసింగ రావుతో కలసి 'బీనాదేవి' కలంపేరిట రచనలు చేశారు. భార్యాభర్తలు ఒకే పేరుతో రాయటం ప్రత్యేకం. డాక్టర్ ఎల్ నరేంద్రనాథ్ గారి సహకారంతో మనసు ఫౌండేషన్ 'బీనాదేవి సమగ్ర రచనలు' పుస్తకం ద్వారా అందిస్తున్నారు. 1972లో వీరికి ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది.

హుండీ చోరీ కేసులో నిందితుల అరెస్ట్.

ధర్మవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం నసనకోట ముత్యాలమ్మ ఆలయ హుండీ చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. రామగిరి మండలం ముత్యాలమ్మ ఆలయంలో ఈ నెల 3న రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హుండీని చోరీచేశారు. ఆలయ ఈఓ ఫిర్యాదు మేరకు రామగిరి ఎస్ఐ సుధాకర్‌యాదవ్ కేసు నమోదు చేసుకున్నారు. రామగిరి సీఐ శ్రీధర్ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. కర్ణాటక సరిహద్దు వద్ద నిందితులు ఉన్నట్టు సమాచారం రావడంతో రామగిరి ఎస్ఐ సుధాకర్‌యాదవ్, సిబ్బంది ఎంసీపల్లి క్రాస్ వద్ద ముగ్గురు దొంగలను అరెస్టు చేసి బైకు, మూడు సెల్‌ఫోన్లు, రూ.1,70,712 స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి, కోర్టుకు హాజరుపరచగా న్యాయాధికారి రిమాండ్‌కు ఆదేశించినట్టు డీఎస్పీ తెలిపారు. కేసును వారం రోజుల్లో ఛేదించిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేనిపల్లి గ్రామంలో ఇంటికి పెయింటింగ్ వేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి ఓ యువకుడు సోమవారం మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన మేర కు బత్తలపల్లి మండలం మాళ్యవంతం గ్రామానికి చెందిన మారుతి, సరస్వతి దంపతుల కుమారుడు రామ్‌చరణ్(17) మరికొంత మందితో కలిసి మల్లేనిపల్లి గ్రామంలోని ప్రతాప్‌రెడ్డి ఇంటికి పెయింటింగ్ వేసేందుకు వెళ్లారు. ఇంటిబయట ఇనుప నిచ్చెన మీద రామ్‌చరణ్ పెయింట్ వేస్తూ పక్కకు మార్చుకునేందుకు నిచ్చెనను తీస్తుండగా ఇంటిపైన ఉన్న కరెంట్ వైర్లు తగిలాయి. దీంతో విద్యుత్‌షాక్‌కు గురై కిందపడ్డాడు. వెంటనే అక్కడున్న వారు ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. ఎస్ఐ పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు.

సంప్రదాయబద్ధంగా కుంభమేళాకు శ్రీకారం



బందోబస్తుకు సిద్ధంగా ఉన్న పోలీసులు



ఉత్సవమూర్తులతో పడవలో వివిధ మఠాధిపతులు

బెంగళూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మైసూరు జిల్లా టి నరసీపురలో కుంభమేళా సంప్రదాయబద్ధంగా శ్రీకారం చుట్టారు. సోమవారం కావేరి, కపిల, స్ఫటిక నదుల సంగమంలో ఉదయం 9 గంటలకు పూజలు ప్రారంభించారు. ఆదిచుంచనగిరి మఠం మైసూరుశాఖ మఠాధిపతి సోమేశ్వరనాథ స్వామిజీ, కాగినెలెశాఖ మఠం శివానందపురిస్వామిజీ జయేంద్రపురిస్వామిజీ, తిరుచ్చి శ్రీబుద్ధస్వామిజీతోపాటు వివిధ మఠాల స్వామిజీలు పుణ్యస్నానం చేశారు. తిరుమకూడలిలోని త్రివేణిసంగమంలో పూజలు చేశారు. జిల్లా అధికారి లక్ష్మీకాంతరెడ్డి, ఎస్పీ ఎన్ విష్ణువర్ధన్‌లు పర్యవేక్షించారు. 1989 నుంచి ప్రతి మూడేళ్లకోసారి కుంభమేళా ఆచరించే సంప్రదాయం కొనసాగుతోంది. ప్రయాగరాజ్, ఉజ్జయిని, హరిద్వార్, లేదా నాసిక్‌లలో జరిగే కుంభమేళాలకు వెళ్లలేని భక్తులు ఇక్కడ పుణ్యస్నానం ఆచరించే సంప్రదాయం ఉంది. స్నానానికి ముందు అగస్త్యేశ్వర, గుంజా నరసింహస్వామి, చౌడేశ్వరి ఆలయాలలో పూజలు చేశారు. అగస్త్యేశ్వర ఆలయంలో గణపతి హోమం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, మహామంగళారతి జరిపారు.

మూడేళ్లకోసారి కుంభమేళా...

ఇక్కడి ఆలయాలు గంగ లేదా చోళుల సామ్రాజ్యంలో చెప్పినట్టు చెబుతారు. ఆలయాలను హొయసళ, విజయనగర పాలకుల విస్తరింపచేశారు. మైసూరు ఒడెయార్ రాజవంశం వాటిని మరింత పటిష్టం చేసింది. 1989లో సుత్తూరు మఠాధిపతి శివరాత్రి దేశికేంద్రస్వామిజీ ఇతర మఠాధిపతులు మూడేళ్లకోసారి కుంభమేళా జరిపేలా తీర్మానించారు. మైసూరు, మండ్య, చామరాజనగర, కొడగుతోపాటు వివిధ ప్రాంతాలనుంచి భక్తులు పుణ్యస్నానం చేసేందుకు తరలిస్తుండడంతో భారీగా బందోబస్తు ఏర్పాట్లు చేశారు. 6 ఇంజన్‌బోట్లను ఏర్పాటు చేశారు. ఘాట్‌లో స్నానాలు చేసేందుకు వీలుగా బ్యారికేడ్‌లు అమర్చారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా శౌచాలయాలు, బట్టలు మార్చుకునేందుకు షెడ్ల వ్యవస్థ కల్పించారు. అత్యవసర విభాగం గజఈతగాళ్లతోపాటు బోట్లను ఏర్పాటు చేశారు. బందోబస్తుకు 11మంది ఎస్పీలు, నలుగురు ఏఎస్పీలు, 27మంది ఇన్‌స్పెక్టర్‌లు సహా సుమారు 1100 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. తొలిరోజున ఉదయం అంతంతమాత్రంగానే భక్తులు ఉన్నా మధ్యాహ్నం తర్వాత భారీ స్థాయిలో ప్రజలు చేరారు. భక్తులు త్రివేణిసంగమం వచ్చేందుకు గుంజా నరసింహస్వామి ఆలయం నుంచి తిరుమకూడలిదాకా ఉచితబస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. అగ్నిమాపక సిబ్బందితోపాటు ఘాట్‌లో ఎప్పటికప్పుడు పరిశుభ్రం కోసం ప్రత్యేక విభాగాలు కొనసాగించారు.

నేడు కావేరి హారతి : వారణాసిలో జరిగే గంగా హారతి తరహాలోనే మంగళవారం సాయంత్రం 7 గంటలకు జరపనున్నారు. గంగా హారతి తరహాలో కావేరి హారతి జరగనుంది. ఇందుకోసం కాశీ నుంచి 15మంది అర్చక బృందాలు వచ్చాయి. వీరికి ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు.

జాగ్రత్తలు పాటించండి: నదులలో స్నానం చేసేవేళ జాగ్రత్తలు పాటించాలని జిల్లా అధికారి ఆదేశాలు జారీ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా భక్తులు సంస్కృతి, సంప్రదాయాలను పాటించాలని సూచించారు. ఈనెల 13వరకు సంగమం ప్రాంతంలో మద్యం అమ్మకాలనునిషేధించారు.

పలు మార్గాల్లో చేరొచ్చు: బెంగళూరు నుంచి మలవల్లి లేదా కనకపుర మార్గంగా టీ నరసీపురకు చేరుకునేందుకు వీలుంది. మద్దూరు, కేఎం దొడ్డి, బెళకవాడి, పురిగాలి మీదుగా టి నరసీపురకు చేరుకోవచ్చు. కనకపుర మీదుగా అయితే సాతనూరు, హలగూరు, మలవల్లిల మీదుగా కుంభమేళాకు చేరుకోవచ్చు. మండ్య నుంచి వచ్చేవారు తిరుగావలు, కల్లుసోదర మార్గంగా టి నరసీపురకు చేరుకోవచ్చు. మైసూరు నుంచి టి నరసీపురకు 31 కిలోమీటర్ల దూరంలో ఉండే కుంభమేళా ప్రదేశానికి ప్రత్యేక బస్సు సదుపాయం కల్పించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యంత్రాంగం అభిప్రాయపడింది.

మౌలిక వసతుల కోసం ధర్నా



ముళబాగిలులో తహసీల్దారు గీతకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ముళబాగిలు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మౌలిక సదుపాయాలు కల్పించాలని, సేవా విషయాలకు సంబంధించి పలు డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ రాష్ట్ర గ్రామపాలనాధికారుల కేంద్రసంఘం తాలూకా విభాగం ఆధ్వర్యంలో పట్టణంలోని మినీ విధానసౌధ వద్ద రెండో విడత నిరవధిక ధర్నా చేపట్టారు. తహసీల్దారు గీతాకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామపాలనాధికారులు, తాలూకా ప్రభుత్వ ఉద్యోగులసంఘం అధ్యక్షుడు కేఎన్ అరవిందగౌడ మాట్లాడుతూ గ్రామ పాలనాధికారుల 23 డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. 2024 సెప్టెంబరు 26నుంచి అక్టోబరు 3వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన చేపట్టామని, అక్టోబరు 3న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అన్ని డిమాండ్ల పరిష్కారానికి హామీ ఇచ్చారన్నారు. అయితే మూడు నెలలు గడిచినా ఇంతవరకు స్పందన కరువైందని అందుకే నిరవధిక ధర్నా చేపట్టామన్నారు. తాలూకా గ్రామ పాలనాధికారుల సంఘం అధ్యక్షుడు గిరీశ్‌గౌడ మాట్లాడుతూ పాలనాధికారులు తగిన కార్యాలయం, తగిన టేబుల్, కుర్చీ, అల్మెరా, అత్యుత్తమ మొబైల్ ఫోన్ (12 జిబి/256 జిబి), సియుజి సిమ్ అండ్ డేటా, గూగుల్ క్రోమ్‌బుక్/ల్యాప్‌టాప్, ప్రింటర్ అండ్ స్కానర్ సదుపాయాలు కల్పించాలన్నారు. గ్రామ పాలనాధికారులకు టెక్నికల్ పోస్టులకు ఇచ్చే వేతనశ్రేణిని అమలు చేయాలన్నారు. అంతర జిల్లా బదిలీలకు రెవెన్యూ శాఖలో ప్రత్యేక మార్గదర్శకాలు కల్పించాలన్నారు. నిరసనలో తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు రవీంద్ర, తాలూకా పాలనాధికారుల సంఘం ఉపాధ్యక్షురాలు స్వప్న, కార్యదర్శి దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బంగారపేటలో...

బంగారపేట: వివిధ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర విలేజ్ అకౌంటెంట్లసంఘం ఆధ్వర్యంలో తాలూకా కార్యాలయం వద్ద సోమవారం నిరవధిక ధర్నా చేపట్టారు. వీఏఓలకు పదోన్నతిలో అన్యాయం జరుగుతోందని అడ్డుకట్ట వేయాలని కోరారు. రెవెన్యూ ఉద్యోగులపై ఉన్న ఒత్తిడిని నియంత్రించాలని కోరారు. ఇలా ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. నిరసనలో గ్రామ లెక్కాధికారి అమరేశ్, వినయ్‌కుమార్, రమేశ్, అవినాశ్, సుజాతా, శ్వేతా, చేతన్‌కుమార్, రవి, అంజలి, వినోద్, మానస తదితరులు పాల్గొన్నారు.

దొమ్మసంద్రలో...

దొమ్మసంద్ర: రాష్ట్ర గ్రామ పాలనా అధికారుల సమస్యలు, డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆనేకల్ తాలూకా కార్యాలయం ముందు శాంతియుతంగా రెండోదశ నిరవధిక ధర్నా చేపట్టారు. సంఘం తాలూకా అధ్యక్షుడు ఏ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నల్లపట్టీలతో శాంతియుత నిరసన చేపట్టారు. నిరసనలో సంఘానికి చెందిన శ్రీనివాస్, మహంతేశ్ కొళ్ళాల్, చంద్రశేఖర్ మూర్తి, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.



ఆనేకల్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన



బంగారపేటలో..

సిరి ధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం



మేళాను ప్రారంభిస్తున్న మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ తదితరులు

బాగేపల్లి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మన పూర్వీకుల కాలంనుంచి సిరిధాన్యాల వాడకం ఉందని వీటితో మెరుగైన ఆరోగ్యం సాధ్యమని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియరల్ కళాశాల ఆవరణలో జిల్లా యంత్రాంగం, ఉద్యానవనాల, వ్యవసాయశాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన సిరిధాన్యాల మేళా, ఫలపుష్ప ప్రదర్శనను ఎమ్మెల్యే, తాలూకాస్థాయి అధికారులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇదివరకు తృణధాన్యాలకు సరైన మార్కెటింగ్ ఉండేది కాదని ఇటీవలికాలంలో సిరిధాన్యాలు, వాటి ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఏర్పడిందన్నారు. ఎమ్మెల్యే సుబ్బారెడ్డి, జిల్లా అధికారి పీఎన్ రవీంద్ర, జడ్పీ సీఈఓ ప్రకాశ్ నిట్టాలి, వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ జావీద్, పోలీస్ అధికారి కుశాల్‌చౌక్సి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు అండర్‌పాస్ ప్రారంభం



అండర్‌పాస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి తదితరులు

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నగరంలో ఇన్ని రోజులుగా ఎదురు చూసిన కనకదుర్గమ్మ గుడి సమీపంలోని అండర్‌పాస్ ఆదివారం ప్రారంభం అయ్యింది. రాత్రి 8 గంటల సమయంలో బళ్లారి కనకదుర్గమ్మ అండర్ బ్రిడ్జిని రాజ్యసభ సభ్యులు డాక్టర్ నాసిర్ హుస్సేన్, సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, బళ్లారి మహానగర పాలిక మేయర్ నందీష్ బాబు ప్రారంభించారు. రాత్రి విద్యుత్ కాంతులతో సువర్ణ బళ్లారి నామఫలకంతో వంతెన దగదగలాడింది. ఈ కార్యక్రమంలో ముండ్రగి నాగరాజు, మానయ్య, కార్పొరేటర్లు విక్కీ, రాజశేఖర్, కుబేర మించు శ్రీనివాస్, కవిత వన్నప్ప, రాజేశ్వరి, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విలేజ్ అకౌంటెంట్ల నిరవధిక నిరసన



నిరసన చేపట్టిన విలేజ్ అకౌంటెంట్ల సంఘం నేతలు

సిరుగుప్ప, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : విలేజ్ అకౌంటెంట్ల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు నిరంతరం పోరాటం కొనసాగిస్తామని విలేజ్ అకౌంటెంట్ల సంఘం జిల్లా అధ్యక్షులు రామప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సిరుగుప్ప పట్టణం తహసీల్దార్ కార్యాలయం ఎదుట విలేజ్ అకౌంటెంట్ల సమస్యల పరిష్కారం కోసం రెండవ విడత ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రామప్ప మాట్లాడుతూ విలేజ్ అకౌంటెంట్లకు పాత పింఛన్ పద్ధతిని అమలు చేసి వేతనాలు పెంచాలని కోరారు. పలు డిమాండ్లను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విలేజ్ అకౌంటెంట్ల సంఘం అధ్యక్షుడు విరుపాక్షి, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఉచ్చీరప్ప, ఆర్ఐ మంజునాథ, అకౌంటెంట్లు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

నీటి కుంటలో పడి వృద్ధుడి మృతి

కదిరి అర్బన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని సున్నపుగుట్ట తండా సమీపంలోని నీటికుంటలో పడి సోమవారం ఓ వృద్ధుడు మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు సున్నపుగుట్టతండాకు చెందిన లక్ష్మీనాయక్ (61) ఆదివారం ఉదయం పొలం పనులకు వెళ్లాడు. చీకటి పడినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించారు. అయితే సోమవారం తెల్లవారు జామున నీటి కుంట ప్రాంతంలో మృతుడి చెప్పులు, దుస్తులు గుర్తించారు. కుంటలో పడి ఉండవచ్చనే అనుమానంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని, అగ్నిమాపక సిబ్బందితో కుంటలో గాలించారు. నీళ్ల అడుగు భాగంలో కాళ్లకు తీగలు చుట్టుకోవడంతో బయటకు రాలేక మృతి చెందినట్లు చెప్పారు. మృతుడి భార్య మినీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శవాన్ని కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. కలువ పువ్వులకోసం తన భర్త కుంటలోకి వెళ్లి ఉంటారని, ప్రమాదవశాత్తు పడి ఉండవచ్చని మృతుడి భార్య ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పర్యావరణంపై అవగాహన పెరగాలి

మహదేవపుర, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరికి సామాజిక చైతన్యం పెరగాలని పద్మశ్రీ గ్రహీత సీనియర్ సాహితీవేత్త డాక్టర్ దొడ్డరంగేగౌడ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని బిఎంశ్రీ ఫౌండేషన్‌లో దొడ్డరంగేగౌడ అభిమానులసంఘం ఆధ్వర్యంలో 79వ పుట్టినరోజు సందర్భంగా పర్యావరణ పరిరణక్షనకు సంబంధించి 'మిడిద మరగళు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మిడిత ఫౌండేషన్ సంస్థ పర్యావరణ మంజు, సింహాద్రి, సౌమ్య పవార్, శివప్ప, సురేశ్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందచేసి అభినందించారు. ఈ సందర్భంగా సినీ దర్శకుడు నాగాభరణ, నాడోజ డాక్టర్ మనుబళిగార్, సాహితీవేత్త ఉపేంద్రకుమార్, చన్నేగౌడ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

విద్యార్థుల ప్రతిభకు ప్రశంసలు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రహమత్‌నగర్ పరిధిలోని గౌసియా మసీదు మదరసా విద్యార్థుల ప్రతిభను ముస్లిం నాయకులు ప్రశంసించారు. వెనకబడిన ముస్లిం విద్యార్థులు కూడా చదువుతోపాటు ధార్మికపఠనంలోనూ రాణించడంపై హర్షం వ్యక్తం చేశారు. మసీదు ధర్మగురు ముఫ్తిగులామ్ జిలాని మాట్లాడుతూ చక్కగా చదివి సమాజసేవతోపాటు దేశసేవలోనూ రాణించాలని పిలుపునిచ్చారు. ఇస్లాం ధర్మంలో విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని, మహ్మద్ ప్రవక్త కూడా ఈ అంశాన్ని ప్రస్తావించారన్నారు. అయితే ముస్లిం పిల్లలు చాలా మంది విద్యపట్ల ఆసక్తి చూపడం లేదని విచారం వ్యక్తం చేశారు. తల్లి దండ్రులు తమ పిల్లల చదువు, సామాజిక, ధార్మిక బోధనలపై ఆసక్తి కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులందరికీ బహుమతులు ప్రదానం చేశారు. మసీదు అధ్యక్షుడు అన్వర్‌సాబ్, ఉపాధ్యక్షుడు అల్లుర్కి సర్దార్, నగరసభ సభ్యుడు తన్వీర్‌పాషా, మాజీ అధ్యక్షుడు రహంతుల్లా, మసీదు ముఖ్యులు తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న విద్యార్థులు

ప్రేమికుల దినోత్సవానికి వండర్ లాలో రాయితీలు

బెంగళూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): దక్షిణభారత్‌లోనే ప్రముఖమైన అమ్యూజ్‌మెంట్ పార్క్ వండర్‌లాలో ప్రేమికుల దినోత్సవానికి ప్రత్యేక రాయితీలు ప్రకటించారు. ఈనెల 14వరకు కపుల్ టికెట్‌గా రూ.1899, సింగిల్స్‌కు రూ.1099గా నిర్ణయించారు. సాధారణ ధరలతో పోలిస్తే 35శాతం రాయితీ ఇస్తున్నట్టు సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ అరుణ్ కె చిట్టిలపిల్లి ప్రకటించారు. 14న వేవ్‌పూల్ డిన్నర్, మ్యాజికల్ ఈవెనింగ్, లైవ్ మ్యూజిక్, ఎంటర్‌టైన్‌మెంట్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఒంటరిగా వెళ్లేవారికోసం 15, 16 తేదీల్లో డీజే నైట్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ముందుగా టిక్కెట్‌లు రిజర్వు చేసుకునే వెసలుబాటు ఉన్నట్టు ప్రకటించారు.

భక్తిశ్రద్ధలతో కన్యకాపరమేశ్వరికి పూజలు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం 105వ వార్షికోత్సవాన్ని సోమవారం భక్తి శ్రద్ధలతో జరిగాయి. ఉదయం వాసవీ కన్యకా పరమేశ్వరికి అభిషేకం, పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఒక సంవత్సరం పాటు నిరంతరం అమ్మవారి పురాణాలను పారాయణ చేస్తున్న సుమారు 600 మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈసందర్భంగా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షురాలు ఉమా సాయిరాం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మహిళా సంఘంలో సభ్యులుగా చేరి వారి కుటుంబ సభ్యులను ఐక్యతతో చర్చించి పరిష్కరించుకోవచ్చన్నారు. ధార్మిక కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు గాదెం గోపాలకృష్ణ, విట్టా కృష్ణకుమార్, అశ్వత్ నారాయణ్, కిషోర్‌కుమార్, నామా నాగరాజు, సొంతగిరిధర, శోభ, లక్ష్మీ, రూప, రత్న, వనజ, మంగళగౌరీ, నాగవేణి, సవితా, కవిత, అనిత తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ప్రశంసాపత్రాల అందజేత

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నగరంలో గాంధీనగర్ ఓ హోటల్‌లో విజయ మేకప్ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికేట్లు పంపిణీ చేశారు. అకాడమీ అధ్యక్షురాలు విజయలక్ష్మీ నేతృత్వంలో అతి తక్కువ రోజుల్లో బ్యూటీషియన్ నేర్చుకున్న మహిళలను వారు ప్రశంసించారు. మాతృమండలి మహిళా అధ్యక్షురాలు పుష్ప చంద్రశేఖర్, కేపీసీసీ మైనారిటీ విభాగ మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షమీమ్ జక్లీ మైనుద్దీన్ భాగ్యలక్ష్మీ, శిరీష, ప్రభ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు బెదిరింపులు

సిరుగుప్ప, ఫిబ్రవరి 10 (ఆంధ్ర జ్యోతి) : పట్టాపాసుపుస్తకాల మార్పిడి విషయంలో తహసీల్దార్ విశ్వనాథ్‌కు బెదిరింపులపై ఫిర్యాదుపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు దాఖలైంది. సిరుగుప్ప తాలుకాలోని దేశనూరు, ఇబ్రహీంపురం గ్రామాలకు సంబంధించి సర్వే నెంబర్ 171 పొలానికి సంబంధించి పట్టా పాసుపుస్తకాలను తమ పేరిట చేయాలని హోస్పేటకు చెందిన ఒక వ్యక్తి ఫోన్ ద్వారా బెదిరించినట్లు తహసీల్దారు పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు ఎస్ఐ పరశురామ్ కేసు దాఖలు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

5.96 లక్షల మందికి ఆల్బెండజోల్ పంపిణీ

- డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి

అనంతపురంటౌన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం ఒక్కరోజే 5,96,128 మంది పిల్లలలకు నులిపురుగుల నివారణకు సంబంధించిన ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి తెలిపారు. నులిపురుగుల నివారణ దినం సందర్భంగా ఏడాది నుంచి 19 ఏళ్ల వయసులోపు అందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీని వైద్యశాఖ నిర్వహించింది. 6,08,529 మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేయాలని వైద్యశాఖ లక్ష్యం పెట్టుకుందని ఆమె తెలిపారు. 97.96 శాతం మాత్రలు వేశామని, మిగిలిన పిల్లలు అందరికీ తప్పనిసరిగా ఆల్బెండజోల్ వేయిస్తామని డీఎంహెచ్ఓ పేర్కొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1617.06	1,588.39
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10.137	442
నీటి నిల్వ (టీఎంసీలు)	53.47	9.74

8న జాతీయ లోక్ అదాలత్

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో మార్చి 8న లోక్‌అదాలత్ నిర్వహించనున్నారు. నగరంలోని తాలూర్‌రోడ్డులోని నూతన కోర్టు సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తుందని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ అండ్ సెషన్స్ న్యాయాధికారి శాంతి ఒక ప్రకటనలో తెలిపారు. బళ్లారి, విజయనగం జిల్లాలోని మొత్తం 31కోర్టుల్లో జరగనున్న మొగా లోక్ అదాలత్ లో పెండింగ్‌లో ఉన్న పలు కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రజలు పార్టీలు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యాలయాన్ని సంప్రదించాలని, 08392-278077నంబరుకు పోన్ చేయాలని తెలిపారు.

విజేతకు అభినందనలు



కార్తీక్‌ను అభినందిస్తున్న వ్యవస్థాపకుడు నాగేశ్వరరావు

కంప్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి అండర్ -16 విభాగంలో చెస్ పోటీల్లో విజయం ప్రథమ స్థానం పొందిన కార్తీక్‌ను పలువురు అభినందించారు. సోమవారం సిరుగుప్పలో జరిగిన ఈ పోటీల్లో కంప్లి పట్టణంలో విద్యాసాగర ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి కార్తీక్ అండర్-16 పోటీల్లో ప్రథమ స్థానం సాధించారు. పాఠశాల వ్యవస్థాపకులు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కార్తీక్‌ను అభినందించారు.

అంధకారంలో ఇందిరానగర్

కంప్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని కుడితిని పట్టణంలో ఇందిరా నగర్ విద్యుత్ దీపాలు లేక అంధకారంగా మారింది. దీంతో ఆ వార్డు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణ పంచాయతీ అధికారులు ఈ విషయంపై తెలిసీతెలియనట్లు వ్యవహరిస్తూ నిర్లక్ష్యం వహిస్తున్నారని కుడితిని హిత రక్షణ సమితి అధ్యక్షుడు కామేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వీధిలైట్లు లేక విద్యార్థులు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు.



చీకట్లో ఇందిరా నగర్ కాలనీ

ప్రాణాలు తీస్తున్న పరిశ్రమలు..!

- యథేచ్ఛగా రసాయనాల విడుదల
- పట్టించుకోని కాలుష్య నియంత్రణ శాఖ



పైపుల ద్వారా వాగులోకి విడుదల చేస్తున్న వ్యర్థాలు

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల జిల్లాగా పేరొందిన బళ్లారిలో కొన్ని కర్మాగారాలు ప్రజల పాలిట యమదూతలుగా మారుతున్నాయి. ప్రజలు అనారోగ్యం పాలవుతున్నా కాలుష్య నియంత్రణ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ప్రవర్తిస్తున్నారు. నెలవారి తనిఖీల్లో భాగంగా ఫ్యాక్టరీలను సందర్శించి చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. నగరంలోని బెంగళూరు రోడ్డులో పారిశ్రామిక వాడ స్టేజ్-2లో ఏర్పాటైన కెమికల్ ఫ్యాక్టరీలు, జీన్స్ ఫ్యాక్టరీల నుండి రోజూ కొన్ని లక్షల లీటర్ల విషపదార్థాలతో కూడిన నీరు ప్రక్కనే ఉన్న వాగులోకి వదిలేస్తున్నారు. దీంతో సమీప గ్రామాల ప్రజలు కాలుష్య నీటినే తాగాల్సి వస్తోందని వాపోతున్నారు. వాగుకు ఆనుకుని ఉన్న కంపెనీలు నేరుగా నీరు వదులుతున్నారు. ఇక్కడ నుండి తయారయ్యే రా-మెటీరియల్స్‌ను హైదరాబాద్‌లోని ప్రముఖ మందుల తయారీ చేసే కంపెనీలకు సరఫరా చేస్తున్నారు. ఈ వాగు నగరంలోని ముండరిగి, కాకర్లతోట, ఆంధ్రాళ్, గోనాళ్, బిసిళహళ్ళి ప్రాంతాలు కలుపుతూ ఆఖరికి వేదవతి నదిలో కలుస్తుంది. వర్షాకాలంలో ఈ వాగు ఉధృతంగా ప్రవహించి.. ఈ వ్యర్థాలను నేరుగా వేదవతి నది ద్వారా తుంగభద్ర నదిలోకి చేరుతనాయ్యి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు కాలుష్యమైన తాగు నీటితో పాటు, దుర్వాసన వెదజల్లి ఇబ్బందికి గురవుతున్నారు. పశువులు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ కంపెనీల వృధా నీటిని నదిలోకి తరలించకూడదని పలు మార్లు స్థానికులు కాలుష్య నియంత్ర ణ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. జనవరి నెలలో ఉప లోకాయుక్త జస్టిస్ వీరప్ప ఇదే ప్రాంతానికి వచ్చి పరిస్థితిని సమీక్షించి అధికారులపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేసి డెడ్‌లైన్ ఇచ్చి వెళ్ళారు. అయినా పరిస్థితి మారకపోవడం గమనార్హం.

డబ్బంతా ఆసుపత్రులకే: మారెక్క, ముండరిగి



కెమికల్ ఫ్యాక్టరీలు ఏర్పాటు కాకమునుపు ముండరిగి గ్రామంలో ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవు. గ్రామానికి ఆనుకుని పరిశ్రమలు ఏర్పాటు కావడంతో నిత్యం నరకం అనుభవిస్తున్నాం. కూలీనాలీ చేసుకుని కూడబెట్టుకున్న డబ్బు ఆసుపత్రికి ఖర్చు చేస్తున్నాము. ఉన్న గూడును వదిలి ఎక్కడికి వెళ్ళాలో అర్థకావడం లేదు.

విషవాయువులు పీలుస్తున్నాం: జడెప్ప, ముండరిగి



రోజంగా కష్టపడి ఇంటికి వస్తే రాత్రిపూట నిద్రపోలేని స్థితి నెలకొంది. రాత్రిపూట ఫ్యాక్టరీల నుంచి విషవాయువులు వదులుతున్న కారణంగా నిద్రలోనే ఊపిరి పట్టేసినట్లు అవుతుంది. రోజూ మాకు ఇదే పరిస్థితి. అధికారులకు, జిల్లా అధికారులకు నెత్తినోరు కొట్టుకుని మా బాధలు వినిపిస్తున్నా ఎవరూ తమ గోడు వినిపించుకోవడం లేదు.

చర్యలు తప్పవు: సిద్దేశ్వర బాబు, కాలుష్య నియంత్రణ అధికారి

నగర శివారు ప్రాంతంలో కెమికల్ ఫ్యాక్టరీలు, జీన్స్ ఫ్యాక్టరీలు వాగులోకి నీరు వదులుతున్న మాట వాస్తవమే. ఏళ్ల తరబడి నీరు వదులుతున్నందు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కెమికల్ ఫ్యాక్టరీలతో పాటు రైస్‌మిల్లులు, ఇతరత్ర బొగ్గు ఆధారిత పనిచేసే ఫ్యాక్టరీల కారణంగా ఫిల్టర్లు వాడకుండా చిమ్నీల నుంచి విషవాయువులు వదులుతున్న వారికి నోటీసులు జారీ చేశాము. తక్షణమే ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేస్తాము.

రుణ వసూళ్ల పేరుతో వేధిస్తే కఠిన చర్యలు: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మైక్రోఫైనాన్స్ కంపెనీలు ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం పనిచేయాలని, రుణ వసూలు నెపంతో మానసిక వేధింపులు, అసభ్యకరమైన పదజాలం వాడకం, దూషణ కేసులు గుర్తిస్తే క్రమ శిక్షణా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా హెచ్చరించారు. నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కేస్వాన్ వీడియో హాల్లో సోమవారం మైక్రోఫైనాన్స్ కంపెనీల ఆఫీస్ బేరర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో అప్పు వసూలు నెపంతో వేధింపులకు పాల్పడిన కేసులు ఏవీ నమోదు కాలేదు. కంపెనీ అధికారులు ప్రభుత్వ రంగ సంస్థలతో మంచి సంబంధాలను కొనసాగించాలన్నారు. ఆత్మహత్యలు చేసుకున్న బాధితులపై చర్యలకు ఆర్డినెన్స్ జారీ అయ్యిందన్నారు. రాబోయే రోజుల్లో ఈ చట్టం అమల్లోకి వస్తుందన్నారు.

ఆర్‌బీఐ మార్గదర్శకాలు పాటించాల్సిందే

మైక్రోఫైనాన్స్ కంపెనీలు ఆర్‌బీఐ మార్గదర్శకాలను పాటించాలని కలెక్టర్ సూచించారు. రుణ మంజూరు ,రకవరీ నియమాలను పాటించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ చట్టవిరుద్ధమైన మార్గాన్ని రుణం మంజూరు చేసేటప్పుడు రుణగ్రహీతతో నేరుగా వ్యవహరించాలన్నారు. మధ్యవర్తులను అనుసరించకూడదని ఆయన అన్నారు. జిల్లా ఎస్పీ శోభరాణి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 118మైక్రోఫైనాన్స్ కంపెనీలున్నాయని, వాటిలో 27కంపెనీలు ఆర్‌బీఐలో అధికారికంగా నమోదు చేసుకున్నాయని న్నారు. మిగిలిన 97 కంపెనీలు నమోదు చేసుకోలేదని సమావేశానికి సమాచారం అందించింది. జిల్లాలో ఎవరైనా డబ్బు వసూలు చేస్తున్నార నే నెపంతో మైక్రోఫైనాన్స్ కంపెనీలను పరువు తీసినట్లు లేదా వేధిస్తున్నట్లు తెలిస్తే వారు 9480803000 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని జిల్లాపోలీసు సూపరింటెండెంట్ తెలిపారు. ఈసందర్భంగా జిల్లాపంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప, సబ్ డివిజన్ అధికారి ప్రమోద్, అదనపు పోలీసు సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, మహిళా శిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయ్ కుమార్, లీడ్ బ్యాంక్ మేనేజన్ గిరీశ్‌తోపాటు వివిధ మైక్రోఫైనాన్స్ కంపెనీల మేనేజర్లుసిబ్బంది ఇతరులు పాల్గొన్నారు.

పురసభ అధ్యక్షుడికి అభినందనలు

కంప్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్ర జ్యోతి): కంప్లి పట్టణం పురసభ నూతన అధ్యక్షుడు బట్టాప్రసాద్‌ను అఖిల కర్ణాటక కమ్మ సంఘం అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ సోమవారం కంప్లి పట్టణంలో అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా గారపాటి రామకృష్ణ మాట్లాడుతూ.. కమ్మ సమాజం నుంచి పురసభ అధ్యక్షుడిగా బట్టా ప్రసాద్ ఎంపిక కావడం హర్షణీయమన్నారు. తను చేసే సేవలు ప్రజల గుండెల్లో నిలిచిపోవాలని అప్పుడే మనకు గుర్తింపు లభిస్తుందన్నారు. తమ సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఇటు సమాజానికి, వార్డుల అభివృద్ధికి కృషి చేసి పట్టణం అభివృద్ధి బాటలో కొనసాగేలా చూడాలని తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బట్టా ప్రసాద్ మాట్లాడుతూ నాయకులు, కౌన్సిలర్లు, ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామన్నారు. పట్టణంలో మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేపడ్తామన్నారు. వారితో పాటు అచ్యుత రాయ్ వర్మ, భాను ప్రకాష్ పాల్గొన్నారు.



బట్టా ప్రసాద్‌ను సన్మానిస్తున్న కమ్మసంఘం అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ



డీసీ కార్యాలయం వద్ద బైఠాయించిన జిల్లా అడలిత అధికారులు

వీఏఓలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

- రాష్ట్ర అడలిత సంఘం డిమాండ్
- నిరవధిక సమ్మెకు సిద్ధం

బళ్లారి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గ్రామ అడలిత అధికారులు(వీఏవో)లకు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర గ్రామ అడలిత అధికారుల పిలుపు మేరకు బళ్లారిలో అధికారులు సోమవారం ధర్నా చేపట్టారు. ముందుగా రాయల్ సర్కిల్ నుంచి ర్యాలీగా వచ్చి బళ్లారి డీసీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో వీరు సమ్మె చేపట్టారు. గ్రామ అడలిత రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సురేష్ కుమార్, బళ్లారి జిల్లా అధ్యక్షుడు ఎం.ఏ, ఆసిఫ్, తదితర నాయకులు ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం 21 స్కీములు ప్రజల కోసం అమలు చేసిందని, వీటిని ప్రజలకు అందించాలంటే కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. అనవసరంగా ఒత్తిడి పెట్టడం సరికాదన్నారు. ఎన్నికల్లో సీఎం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. డిమాండ్ల సాధనకు నిరంతర నిసరన కొనసాగిస్తామని తెలిపారు. వీరితో పాటు కార్తీక్, మంజునాథ, యశ్వంత్, లక్ష్మి, శిరీష, పద్మావతి, తదితర ఉద్యోగులు హాజరయ్యారు.

శరణుల జీవితం అందరికీ ఆదర్శం

- జయంతి కార్యక్రమంలో వక్తలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రచయిత్రి వెంకమ్మ, ముండరగి నాగరాజు

బళ్లారి సిటీ/సిరుగుప్ప, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): శరణుల మాటలు నేటి ఆధునిక యుగంలో కూడా సందర్భోచితంగా ఉన్నాయని, నేటి యువ తరం వారి ఆదర్శాలను అనుసరించి ముందుకు సాగాల్సిన అవసరం ఉందని డాక్టర్ జగ్జీవన్‌రామ్ లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ముండరగి నాగరాజు అన్నారు. జిల్లా యంత్రాంగం, జిల్లాపంచాయతీ, కన్నడ సాంస్కృతిక శాఖ, మహానగర పాలిక ఆధ్వర్యంలో నగరంలోని జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిర వేదిక హాల్లో సోమవారం నిర్వహించిన మాదరి చెన్నయ్య, దోహర కక్కయ్య, హరలయ్య ,మదర దూలయ్య, ఉరిలింగ పెద్ది జయంతి కార్యక్రమాన్ని శరణుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. సిరుగుప్ప తహసీల్దార్ కార్యక్రమంలో జయంతి వేడుకలు నిర్వహించారు.సిరుగుప్పకు చెందిన దళవాయి అంబన్న తన సహచరులచే శరణుల వచన కీర్తనలను ప్రదర్శించారు. ఈసందర్భంగా కన్నడ సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజ్, రచయిత్రి వెంకమ్మ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

- రూ 9.10లక్షల సొత్తు స్వాధీనం

గంగావతి రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గంగావతి, బాదామి, హావేరి జిల్లా సవణూరు పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఇళ్ళ చోరీ కేసులను పోలీసులు సోమవారం ఛేదించారు. నిందితుడి నుంచి రూ 9.10లక్షల విలువ చేసే బంగారు ఆబరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో అరెస్టు అయిన నిందితుడు కనకగిరితాలూకా ప్రభుత్వ ఆసుపత్రి వెనుక బజంత్రి వీధికి నివాసి బజంత్రి(23)గా గుర్తించారు. గంగావతి నగర పోలీసు స్టేషన్‌లో 01, బాదామి పోలీసుస్టేషన్ 2 హావేరి జిల్లా సవణూరు పోలీసు స్టేషన్‌లో 1 కేసుతో చేరి మొత్తం 4 కేసులో నిందితుడుగా ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితుడి నుంచి రూ 8.78లక్షల విలువ చేసే 101 గ్రాముల బంగారు ఆబరణాలు, రూ.32వేల నగదు చేరి మొత్తం రూ.9.10 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు. పోలీసులను ఎస్పీ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న నగలను చూపుతున్న పోలీసులు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

కంప్లి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని ఎం సూగూరు గ్రామంలో గంగాపరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన సోమవారం వైభవంగా జరిగింది. ఉదయం కలశాలతో ఊరేగించారు. అనంతరం ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప పాల్గొని మాట్లాడుతూ గంగామత సమాజ శిక్షణ, ఆర్థికంగా, రాజకీయంగా ముందడుగు వేయాలన్నారు. అప్పుడే గుర్తింపు వుంటుందని తెలిపారు. తమ హయాంలో గంగామత సమాజాన్ని ఎంతో గుర్తించి వారికి సదుపాయాలు కూడా కల్పించామని తెలిపారు. వారితో పాటు ఉలిగప్ప, ఈరన్న, మంజునాథ్, హెచ్ఎం వీరేష్, రామలింగప్ప, మల్లికార్జున, బసవరాజు, తిమ్మప్ప, పంపన్నగౌడ, పక్కీరప్ప, గంగామత సమాజం పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఐరన్ మాత్రలతో రక్తహీనతకు చెక్: డీహెచ్ఓ

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గర్భధారణ సమయంలో పోషకాహార అవసరాలు చాలా ముఖ్యమైనవని, రోజూ ఐరన్ మాత్రలు తీసుకోవడం వల్ల రక్తహీనత నివారించవచ్చని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ అధికారి రమేష్‌బాబు తెలిపారు. సోమవారం ఆయన చెల్లగుర్కి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని యాల్పి గ్రామాన్ని సందర్శించి గర్భిణీ తల్లిదండ్రులతో మాట్లాడారు. గర్భిణులకు పలు ఆరోగ్య సూచనలు ఇచ్చారు. ఈసందర్భం గా జిల్లా నర్సింగ్ సూపర్‌వైజర్ గిరీశ్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ సిద్దరామప్ప, ప్రాథమిక ఆరోగ్య పరిరక్షణ అధికారి నాగమ్మ, హెల్త్ ఆఫీసర్ మౌనిత గౌడ, ఆశా వర్కర్ సునితమ్మ, లక్ష్మి, స్థానికులు పాల్గొన్నారు.



గ్రామంలో పర్యటిస్తున్న డీహెచ్ఓ రమేష్‌బాబు, ఆరోగ్య సిబ్బంది

హోసూరు జోన్



శాఖమాను అటవీ ప్రాంతం

అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

హోసూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలో భారీ విస్తీర్ణంలో అటవీ ప్రదేశం ఉంది. ఎండాకాలం సమీపిస్తుండడంతో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పర్యావరణ, వన్యజీవి ప్రేమికులు కోరుతున్నారు. కృష్ణగిరి జిల్లా మొత్తం వైశాల్యం 5143 చదరపు కిలోమీటర్లు ఉండగా హోసూరు అటవీ విస్తీర్ణం 1492 చదరపు కిల్లోమీటర్లు అంటే సుమారు 29శాతం అడవులు ఉన్నాయి. ఈ అటవీ ప్రాంతంలో వెదురు, టేకు, చందనం, జాలరి చెట్లు అధికంగా ఉన్నాయి. అలాగే ఏనుగులు, చిరుతపులులు, జింకలు, ఎలుగుబంట్లు, నెమళ్లు, ఇంకా అరుదైన జంతువులు అనేక పక్షి జాతులు, అంతరించిపోతున్నాయి. ఎన్నో జాతుల సీతాకోకచిలుకలు కూడా ఉన్నాయి. కాబట్టి ముందుజాగ్రత్తగా అటవీశాఖ ఒక బృందాన్ని ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని, అగ్ని ప్రమాదం ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. అదే విధంగా గిరిజనులు, పర్యాటకులకు అవగాహన కల్పించాలని అటవీప్రాంతంల్లో ట్యాంకులను నీటిని నింపేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దురుద్దేశంతోనే ఎయిమ్స్ మంజూరులో జాప్యం

- యూత్ కాంగ్రెస్ నాయకుడు రవి భోసరాజు

రాయచూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాకు ప్రతిష్టాత్మకమైన ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఎయిమ్స్)ను మంజూరు చేయడంలో కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తున్నట్లు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు రవి భోసరాజు ఆరోపించారు. ఈ విషయంలో ఇతర పథకాల ద్వార జిల్లాలోని ఆస్పత్రుల అభివృద్ధికి నిధుల మంజూరు చేస్తామంటు కేంద్ర మంత్రులు చేస్తున్న ప్రకటన ప్రజలను ముఖ్యంగా ఎయిమ్స్ కోసం సాగుతున్న ఉద్యమాన్ని తప్పుదోవ పట్టించేందుకేనని ఆరోపించారు. సోమవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి రవి భోసరాజు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రెండు సార్లు కేంద్రానికి నివేదిక పంపారని, రాయచూరు జిల్లాకు ఎయిమ్స్ మంజూరు కోరుతూ రెండు సార్లు లేఖలు కూడా రాసారన్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రిగా ఉన్న రాష్ట్ర వైద్య విద్యశాఖ మంత్రి డాక్టర్ శరణప్రకాశ్ పాటీల్, జిల్లాకు చెందిన నిన్ననీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్.భోసరాజులు ఇప్పటికే డిల్లీ పెద్దలను కలిసి జిల్లాకు ఎయిమ్స్ కోసం పలు సార్లు విజ్ఞప్తి చేశారన్నారు. వీరితో పాటు ఎమ్మెల్యేల బృందం సహితం ఇటీవల కేంద్ర మంత్రులను కలిసి వినతి పత్రాలు ఇచ్చినా ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు.



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ

హోసూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ప్రైవేట్ ఐటీఐ అథ్లెటిక్స్ టోర్నమెంట్ జిల్లా ప్రైవేట్ వృత్తి శిక్షణా కేంద్రాల క్రీడా మైదానంలో క్రీడాపోటీలు నిర్వహించారు. క్రీడాపోటీల్లో జిల్లా నైపుణ్య శిక్షణ సహాయ సంచాలకులు పన్నీర్ సెల్వం ప్రారంభించారు. క్రీడా పోటీల్లో హోసూరు పెరుమాళ్ మణిమేగలై వృత్తి శిక్షణా కేంద్రం విద్యార్థులు 100 మీటర్ల, 200 మీటర్ల, 500 మీటర్ల లాంగ్ జంప్, షాట్‌పుట్, వాలీబాల్, ఫుట్‌బాల్‌లలో విజేతలుగా నిలిచారు. మొదటి స్థానంలో నిలిచి టైటిల్‌ను కైవశం చేసుకున్నారు. పీఎంసీ టెక్ చైర్మెన్ కుమార్, సెక్రటరీ మలర్, డైరెక్టర్ సుధాకరన్, ఐటీఐ ప్రిన్సిపాల్ బాబు, తోటి కళాశాల విద్యార్థులు, విద్యార్థినులను అభినందించారు. క్రీడా విభాగం ఇన్‌చార్జ్ ఉపాధ్యాయులు అబ్బర్ జాన్, నందికేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడిక తొలగించండి

హోసూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): హోసూరు లాల్ ప్రాంతంలో కొన్ని నెలలుగా మురుగుకాలువలు చెత్తా చెదారంతో పేరుకుపోవడమే కాక పూడికతో నిండిపోయింది. దీంతో దుర్గంధంతో సమస్య నెలకొందని స్థానికులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. సిప్‌కాట్ వాసులు ఎమ్మెల్యే ప్రకాశ్‌కు ఫిర్యాదు చేశారు. హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 17వ వార్డు లాల్, ఎంఎంనగర్, గాంధీనగర్, మురుగుకాలువలు, రోడ్లు మొదలైనవి హోసూరు సిప్‌కాట్ పరిధిలో ఉన్నాయి. కొన్ని నెలలుగా కాలువలు నిండి దుర్వాసన వస్తున్నాయని పేర్కొన్నారు. 17వ వార్డుకు చెందిన నాగరాజు మాట్లాడుతూ సిప్‌కాట్ సెప్టిక్ ట్యాంకులు నిండిపోయి రోడ్డుపై ప్రవహిస్తూ దుర్వాసన వస్తుందన్నారు. ఒక ప్రైవేట్ పాఠశాల, ప్రైవేట్ బాలికల కళాశాల ఉన్నాయి. వందలాది నివాసులున్న ప్రాంతంలో డ్రైనేజీలను శుభ్రం చేయాలని కోరారు.



పేరుకున్న చెత్తాచెదారం